
కథ

# దృష్టి - సృష్టి

పి.వి.డి.ఎస్. ప్రకాష్



కాలింగ్ బజ్జర్ మోగింది. పడక మీంచి లేచి వెళ్లి తలుపు తీసాడు కిషన్.

"అప్పుడే తెల్లారిందా?" నిద్ర కళ్ళతోనే ఆమెని చూస్తూ అడిగాడు.

"అవునయ్యగారూ! తెల్లగా తెల్లారి పోయింది అమ్మగారుంటే ఇంకాసేపు మీరు పడుకునే వారేమో? నే వచ్చి మిమ్మల్ని లేపేసినట్లున్నాను..." నొచ్చుకున్నట్లు అంది లక్ష్మి.

"అదేం లేదు... ఆఫీసుకెళ్లేందుకు నేనూ తెమలాలి కదా!" అంటూ పక్కకు తొలిగి దారిస్తూ ఆమె లోనికి వచ్చాక తలుపులు మూసాడు. లక్ష్మి సరాసరి బెడ్ రూంలోకి వెళ్లింది. చిందరవందరగా ఉన్న పక్క బట్టలు సర్దడం ప్రారంభించింది. మొదట రగ్గు తీసి మడత పెట్టింది. బెడ్ మధ్యలోకి వచ్చిన తలగడకు గలీబు చక్కగా అమర్చి ఎక్కడుంచాలో అక్కడుంచింది. టీపాయ్ మీద ఎంగిలి గ్లాసులు, మంచినీళ్ల చెంబుతీసి కిచెన్‌లోకి వచ్చింది. ఈలోపు బాత్‌రూం కెళ్లి బయట కొచ్చిన కిషన్ లక్ష్మి తన బెడ్ సర్దిన సంగతి గుర్తించి - "లక్ష్మీ... ఈ పనులన్నీ నీకెందుకు? అమ్మ గారు వచ్చే లోపల నా పక్క బట్టలు కూడా సర్దుకోలేనంత బద్ధకస్తున్ని చేసేలా ఉన్నావ్ నువ్వు..." అన్నాడు.

"అదేంటయ్య గారూ, అలాగంటారు. ఊరెళుతూ అమ్మగారు మిమ్మల్ని, ఈ ఇంటినీ నాకప్పగిస్తూ 'ఒసే, లక్ష్మి! మా ఆయన వట్టి బద్ధకస్తుడు. ఆఖరికి అగ్గిపుల్ల వెలిగించి స్టవ్ వెలిగించడం అలవాటు లేని మనిషి. నే వచ్చేదాకా కాస్త జాగ్రత్తగా చూసుకో...' అన్నారండీ. మీకెలాంటి అసౌకర్యం కలుగకుండా అమ్మగారికిచ్చిన మాట నిలబెట్టుకోవద్దూ?" ఎదురు ప్రశ్న వేసింది లక్ష్మి.

"తొలి కాన్పు.... పుట్టింట్లోనే చేయడం ఆనవాయితీ..." అంటూ అత్తగారు మరీమరీ చెప్పడంతో భార్యని ఆమె పుట్టింటికి పంపిచక తప్పలేదు కిషన్‌కి.

"ఆమె వచ్చేదాకా... సుమారు నాలుగు నెలల వరకూ బలవంతపు బ్రహ్మచర్యమే.." అనుకున్నాడతను.

పెళ్లి కానప్పుడు ఇంతింట్లో ఉండే వాడు కాదు తను. ఆఫీసుకి దగ్గర చిన్నరూం తీసుకుని ఉండే వాడు. ఆకలేస్తే హోటల్‌లో ఇన్ని మెతుకులు కతకడం, సాయంత్రం ఆఫీసయ్యాక బోర్ కొట్టే వరకూ స్నేహితులు, సిన్మాలంటూ రోడ్డు పట్టుకు తిరగడం, ఏ



అర్ధరాత్రో, అలసిన శరీరాన్ని రూంకి చేరవేసి నిద్రలోకి జారుకోవడం...!

బ్రహ్మాచారి గది కదా! చదివి వదిలేసిన పేపర్లు, మేగజైన్ల ఎక్కడపడితే అక్కడే ఉండేవి. రూం దగ్గర్లోని టీ స్టాల్ నుంచి ఓ కుర్రాడు ప్రతి ఉదయం టీ తెచ్చేవాడు. టీ తాగిన తర్వాత ఆ గ్లాసులు తీసుకెళ్లడానికి వాడు బద్ధకించేవాడు. దాంతో, ఎండిపోయిన టీ చారికలతో, ఈగలు ముసురుతూ ఉండే గ్లాసులు ఆ రూంకి అలంకార ప్రాయమయ్యేవి.

పెళ్లి చూపుల తర్వాత ఇంకా పెళ్లి కాకుండానే కిషన్‌ని చూసేందుకు ఒకసారి వచ్చి ఆశ్చర్యపోయింది రేఖ. కాసేపు ఆమాట ఈమాటలయ్యాక... కొత్త కాస్త పోయింది కామోసు... కాబోయే శ్రీమతి హోదాలో కాస్తంత కటువుగానే

''ఈ రూంలోనా మీరు ఉంటున్నది?'' అడిగింది ఉండబట్టలేక.

''అవును... ఇదే రూంలో ఉంటున్నాను. ఆఫీసుకు దగ్గర కదా! ఏం బాగోలేదా?'' అన్నాడు కిషన్.

''ఈ రూం కంటే కార్పొరేషన్ చెత్తకుండీ మేలు. కాస్త నీట్‌గా ఉంటుంది'' చిరాగ్గా ముఖం పెట్టి అంది రేఖ.

''బహ్మాచారి గదులు ఇలా కాకుండా మరెలా ఉంటాయి? అప్పటికీ నీవొస్తున్నావనీ రాత్రంతా మేలుకుని గదిని నీట్‌గా సర్దాను కూడా..'' చెప్పాడు కిషన్.

''ఏమో... మీరు నచ్చారు. కానీ, మీ గది నాకు నచ్చలేదు. ఈసారి నేనొచ్చేసరికి ఈ రూంలో మీరు ఉండకూడదు...'' అది రేఖ.

''నీవొచ్చాక చిన్నిరూం ఎందుకు? ఆధునికంగా అన్ని వసతులున్న అపార్టమెంట్‌లో సింగిల్ బెడ్ రూం పోర్షన్ తీసుకుంటాను..'' అన్నాడు కిషన్.

ఆరు నెలల తిరక్కముందే వారిద్దరికీ పెళ్లయింది. కిషన్ అలా ఈ ఇంటివాడయ్యాడు.

''అయ్యగారూ, కాఫీ'' అందించింది లక్ష్మి. బ్రెష్ చేసుకుని రాగానే పాలెక్కువ పోసి తయారు చేసిన కాఫీ ఓ చుక్క గొంతులోకి దిగగానే ఎక్కడలేని హుషారొచ్చింది కిషన్‌కి.

''కాఫీ కలపడం ఎక్కడ నేర్చుకున్నావ్?''

''బాగుందాండీ?''

''చాలా... మరోమాట చెప్పనా? మీ అమ్మగారు కూడా ఇంత బాగా కాఫీ కలపలేరు'' అన్నాడు కిషన్.

''పోండి... అయ్యగారూ! వేళాకోళం చేస్తున్నారు...'' సిగ్గుపడింది లక్ష్మి. ఆ సిగ్గులో అప్పుడే లక్ష్మిని శ్రద్ధగా చూసాడు కిషన్.

''నల్లగా ఉన్నా ముఖం కళైందే. పాతికేళ్లుంటాయోమో... ఒద్దికైన పరువాలతో పిటపిటలాడు తోంది'' అనుకున్నాడు తొలిసారిగా. ఆ ఆలోచన అతడిని అపరాధ భావనకు లోను చేసింది.

వెన్వెంటనే పుట్టింట్లో ఉన్న భార్య గుర్తొచ్చింది. దాంతో, చూపులు తిప్పుకుని ఆ రోజు దినపత్రిక పతాక శీర్షికలో తలదూర్చాడు కిషన్.

''అన్నట్లు చెప్పడం మరిచాను. ఇలా కాఫీ పెట్టడం మా ఇంటాయన నాకు నేర్పించాడండీ. జగదాంబా జంక్షన్‌లోని స్టార్ హోటల్‌లో పని చేస్తాడయ్యగోరూ మా ఆయన. రోజూ బిర్యానీ పొట్లమో, కర్రీయో, అన్నంలోకి నంచుకోవడానికి ఇంత సాంబారో... ఇలా ఏదో ఒకటి హోటల్ నుంచి తెస్తాడండీ. ఇంట్లో అన్నం వండితే సరిపోతుంది... ఆ హోటల్‌లోనే పెద్ద పెద్ద వారంతా దిగుతారట. వారు మెచ్చేలా ఇలా కాఫీ కలపడం కూడా విద్యేనంటాడు మా ఆయన గొప్పగా...'' నాన్ స్టాప్‌గా చెప్పుకు పోతోంది కళ్లింతలు చేసుకున్న లక్ష్మి.

తర్వాత-

గదులు ఊడ్చేందుకు చీపురుకట్ట తీసుకుంది. ఇక పేపర్ చదివేందుకు

మనస్కరించలేదు కిషన్‌కి. దిన పత్రిక మడిచి టీపాయ్ మీద పెట్టి ఆమె వంక తదేకంగా చూసాడు కిషన్. అదేం పట్టించు కోకుండా లక్ష్మి తన పనిలో తాను నిమగ్నమై, ఏకాగ్రతతో ఏకధాటిగా పని చేసుకుంటూ పోతోంది.

వళ్లునలా విల్లులా వంచి ఆమె ఇల్లు ఊడుస్తుంటే చూడచక్కని దృశ్యం ఆవిష్కృతమైంది. లక్ష్మి చీరకట్టు సమ్మోహనంగా ఉందనిపించింది. నిజానికి, ఇండియన్ ట్రెడిషనల్ వస్త్రం చీరలోనే అతివలు సెక్సీగా ఉంటారట. దేశ విదేశీ సర్వేలు సైతం ఇదే విషయాన్ని వెల్లడించాయి. ఇంకా వెల్లడిస్తూనే ఉన్నాయి కూడా. మినీస్, మిడ్డీస్, గాగ్రాచోళీ, పంజాబీ డ్రస్‌లెన్ని రకాలున్నా చీర సౌందర్యం చీరదే. సిటీలో పుట్టి పెరిగిన అమ్మాయిలు తాము ధరించే ఆధునిక వస్త్రాలతో పాటు అడపాదడపా కట్టే చీరల మధ్య కన్నా... పల్లెటూరి అమ్మాయిల చీరకట్టులో అందం ఆకర్షనీయమని... ఇప్పుడు లక్ష్మిని చూస్తే అర్థమవుతోంది. లక్ష్మి చీర కట్టే విధానమే కొత్తగా, గమ్మత్తుగా ఉంది. శరీరంలోని ప్రతి భాగాన్ని సౌందర్యవంతంగా వ్యక్తీకరిస్తూ చూడ చక్కగా ఉంది. ప్రత్యేకించి... భుజాలకు కాస్తంత దిగువగా ఎత్తయిన కలశాల నడుమ అద్భుతంగా పయ్యెద జాలు వారుతుంటే అల్లరల్లరి వేటూరి పాట తుళ్లింతలవుతున్నట్లుంది.


అలా ఆమె వంగి పనిచేసుకుంటూ పోతుంటే... వదులుగా ఉన్న జాకెట్‌లోంచి కనిపిస్తున్న బంగారు వర్ణాల ఆ రెండు బంతులు చూపుల్ని ఇట్టే ఆకర్షిస్తున్నాయి. 'బ్రా' లేక కాబోలు తమని అడ్డుకునే వారెవరూ లేరనే పొగరుతో ఆ స్వర్ణకలశాలు స్వేచ్ఛగా, విచ్చల విడితనాన్ని ప్రదర్శిస్తున్నాయి.

డ్రాయింగ్ రూం నుంచి బెడ్ రూం దాకా అన్ని రూంలను వంచిన తల ఎత్తకుండా ఏకధాటిగా తుడిచేసింది లక్ష్మి. ఆ తర్వాత అలసటతో ఉసూరుమని నిట్టూర్చి ఒక్కసారి నిటారుగా లేచి నిలచి పైట కొంగును పైకితీసి గట్టిగా విదిలించి కొట్టి విసురుగా మళ్లీ భుజానపైకి వేసుకుని... అంత లోనే చీపురుని గదిలో ఓ మూల గిరాటేసి చేతులూ, కాళ్లూ, ముఖాన్ని కడుక్కునేందుకు లోనికి వెళ్లి అయిదే అయిదు నిముషాల్లో వచ్చింది లక్ష్మి.

ముత్యాలాంటి నీటి బిందువులతో తడితడిగా మెరిసిపోతున్న ముఖాన్ని పైటకొంగుతో తుడుచుకుంటోంది. అలా ఆమె చేస్తున్న చర్యతో అచ్ఛాదన ఏ మాత్రం లేని పయ్యెదలోని అందాలు కిషన్ దృష్టిని దాటిపోలేదు.

అంతలోనే ''అయ్యగారూ! పనైపోయిందం''టూ సెలవు పుచ్చుకుంది లక్ష్మి.

ఆమె వెళ్లిపోయింది కానీ, కిషన్ స్మృతి పథంలో ఆమె అందాల జాతరే.



''మాటే మంత్రమూ... మనసే బంధమూ...'' సెల్ రింగైంది. రేఖకి ఎంతో ఇష్టమైన పాట. కాలర్ ట్యూన్‌గా అమర్చుకున్నాడు కిషన్. సెల్‌లో ఆ పాట మోగితే రేఖ ఆవలివేపు ఉన్నట్లే.

''ఎలా ఉన్నారు?''

''ఏదో ఇలా ఉన్నా'' కంఠంలో దిగులుతో కిషన్.

''వారం రోజులైంది ఇటు వేపు వచ్చి. ఒకసారి రాకూడదూ!''

''వచ్చే ఆదివారం తప్పకుండా వస్తాను'' చెబుతున్నాడు కిషన్.

నిన్న మొన్నటివరకూ బ్రహ్మచర్యపు జీవితం. ఎక్కడికెళ్లినా, ఎప్పుడొచ్చినా అడిగే వారు లేరు. పెళ్లితో జీవితానికి పరిపూర్ణత సిద్ధించినట్లనిపించితే... వారసుడి రాకతో తండ్రిగా పదోన్నతి లభిస్తుందేమో?

''సామాజికంగా నాకో హోదా కల్పిస్తున్నావ్. ఏమిచ్చి తీర్చుకోను నీ రుణం'' అంటున్నాడు కిషన్ కాస్తంత భావోద్వేగంతో.

''అవును... నాకు అలాగే అనిపిస్తోంది. పెళ్లికి ముందువరకూ తూనీగలాగా ఆడిపాడే అమ్మాయిని నేను. ఇప్పుడో... ఓ అమ్మాయికో, అబ్బాయికో తల్లిని కాబోతున్నాను..'' అంటోంది రేఖ.

కొద్దిక్షణాల మౌనం. అయినా, సెల్ ప్రకంపనల ద్వారా మనసూ మనసూ మాట్లాడుకుంటున్న సందర్భం.

ఆ తర్వాత అంది రేఖ – ''డాక్టర్‌ని కలుస్తున్నాను. సూచనలు పాటిస్తున్నాను. మీ వారసుడిని కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్నాను, తెలుసా? బిడ్డ పెరిగి పెద్దదవుతోంది కాబోలు... ఒకటే ఆయాసం. ఓర్చుకోలేక పోతున్నాను. కాసేపు నడవ లేను. డాక్టరేమో... ప్రతి సాయంత్రం రెండు ఫర్లాంగులైనా నడవమంటోంది. అమ్మ నన్ను నడిపించలేక నానా అవస్థలూ పడుతోంది. ఈ ఆదివారం మీరొస్తే... ఆ ప్రహసనం చూడొచ్చు. ఇంతకీ ఆఫీసు కెడుతున్నారా? డుమ్మా కొడుతున్నారా?''

''వెడుతున్నాను. ఆఫీసులో ఆడిటింగ్. రాత్రి ఇంటికి రావడం కాస్త ఆలస్యమవుతోంది''

''అన్నట్లు అడగడం మరిచిపోయాను. లక్ష్మీ ఎలా ఉంది? నాగా పెట్టకుండా రోజూ వస్తోందా? ఆమెతో ఎక్కువగా మాటాడకండి. గంటలకొద్దీ టీవీ సెవన్‌లా ప్రతిక్షణం వార్తా ప్రసారాలను వెలువరిస్తుంటుంది. ఎవరైనా మాటాడితే చాలు, ఒళ్లు, ఇల్లు, స్వరం మరచిపోతుంది. చిన్ననాటి సంగతుల నుంచి ఇప్పటివరకూ పూసగుచ్చినట్లు చెప్పేస్తుంది. వింటున్నారా?'' చెబుతోంది రేఖ.

''వింటున్నాను. లక్ష్మితో ఎక్కువ మాట్లాడను. అసలేం ఉంటాయి ఆమెతో మాటాడేందుకు? వస్తోంది. పని చేసుకుపోతోంది. అంతే....'' ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా ఆమె ప్రస్తావన మార్చాలనుకున్నాడు కిషన్.

''ఇంతకీ అది నన్ను తలచుకుంటుందా?'' కుతూహలంగా అడిగింది రేఖ.

''రోజూ నీ నామస్మరణే చేస్తోంది...'' కిషన్.

''లక్ష్మితో జాగ్రత్త. ఇరుగు పొరుగూ గమనిస్తుం

టారు''

''నా మీద అనుమానమా?''

''మీ మీద కాదు.. మీ కోడె వయసు మీద. పెళ్లయిందగ్గర్నుంచీ చూస్తున్నాను కదా, ఒక్క పూటైనా పస్తు పడుకోని 'మగా'ను భవాన్ని. అందుకే... కాస్తంత అనుమానం. పురిటికని పుట్టింటికి రాక తప్పని పరిస్థితుల్లో పనుల్లో మీకే కష్టం కలుగకూడదని లక్ష్మిని రమ్మని చెప్పాను. పొద్దునే అయితే చాలు... లక్ష్మి, మీరూ ఏకాంతంలో ఉంటారన్న భావనే నన్ను నిలువనీయడం లేదు. ఆపుకోలేని కోరికతో మీరే కొంప ముంచుతారోనని అనుకుంటూ ఉన్నానిక్కడ''.

''అదేం లేదు...'' మాటిచ్చాడు కిషన్.

మరిన్ని జాగ్రత్తలు చెప్పిన తర్వాత రేఖ ఫోన్ పెట్టేసింది.

కిషన్‌కి లక్ష్మి గుర్తొచ్చింది. నిలువెత్తు విగ్రహంగా కాదు... ముఖం నుంచీ గుండెల వరకూ. ఏ మాత్రం తెరచాటు లేని ఎత్తయిన కలశాలు. ఆ రెండింటి మధ్య నుంచి జాలువారే పయ్యెద. ఆ దృశ్యం ఎంతో అపురూపంగా అనిపిస్తోంది కిషన్‌కి. లక్ష్మి ఎప్పుడు కళ్లవాకిళ్లలో వాలినా అదే రూపం కనిపిస్తోంది. అవును – లక్ష్మి ఎప్పుడు పైటను వంటి చుట్టూ కప్పేసుకోదు. పాపి కొండల మధ్యనుంచీ పరిగెత్తే నదీ పాయలాగ సింగారించుకుంటుంది. దాంతో, ఆమె వయసు పొంకం ఆవిష్కృతమై 'రవి వర్మ లిఖించని చిత్రం'లా భాసిస్తుంది.

ఓ ఆదివారం అత్తారింటికెళ్లి వచ్చాడు కిషన్. అత్తారింట్లో భార్య సమక్షంలో ఉంటున్నా ఎందుకో లక్ష్మి గుర్తుకురావడం విచిత్రమనిపించింది. 'పొరుగింటి పుల్లకూర' మనస్తత్వం అంటే ఇదేనేమో? అనుకున్నాడు అంతలోనే. ఇంట్లో రంభలాంటి భార్య అందుబాటులో ఉన్నా... అందాలన్నీ 'మహా నైవేద్యం'లా వడ్డిస్తున్నా మరో అందం గుర్తొస్తున్నదంటే... 'అది వయసు మహిమా, మనసు గారడీయా?' అర్థం కాకుండా ఉంది కిషన్‌కి.

రెండ్రోజుల్లో అత్తింటి నుంచి వచ్చాడు కిషన్. లక్ష్మి కూడా ఆ రెండు రోజులూ కిషన్‌నే తలచుకుంది. కాబోలు...

మాటిమాటికీ – ''మీరు ఊరెళ్లారు గానీ... నాకిక్కడేం తోచలేదండి. ఉదయాన్నే లేచి తయారై ఈ ఇంటికి రాబోతుంటే అప్పుడు మీరు ఊరెళ్లారన్న సంగతి గుర్తొచ్చేదండీ...'' చెప్పేది లక్ష్మి.

ఆనందమనిపించింది కిషన్‌కి. సరిగ్గా తన మనసులో ఏ రకంగా భావప్రకంపనలూ కలుగుతున్నాయో...., సరిగ్గా అలాగే, లక్ష్మిలో కూడా కలుగుతున్నాయని తెలిసి కొత్త ఉత్తేజం అతనిలో. అంటే... లక్ష్మి తన గురించి ఇంట్లో కూడా ఆలోచిస్తోందన్న మాట. ఒక్కరోజు ఒక్కో అందంతో భాసిల్లుతోంది లక్ష్మి. చూపుల్తో చుట్టేస్తోంది. మాటలతో మంత్రిస్తోంది.

ఓ రెండ్రోజులు పనిలోకి రాలేదు లక్ష్మి. గాభరా పడ్డాడు కిషన్. ఆమె ఉండేదెక్కడో తెలుసతనికి. రాకపోవడానికి కారణాలు ఆరాతీస్తూ ఆమె ఇంటికి వెళ్లాలనిపించినా... సందేహించాడు. ఆమె పట్ల తనలో పెరుగుతున్న భావాలు కళ్లలో కదిలి ఆమె మొగుడికీ 'రెండ్ హాండెడ్'గా దొరికి పోతానేమోననే భయంతోపాటు, ఇరుగు పొరుగుకి తెలిస్తే విషయం విషమిస్తుందనే ఆందోళన కూడా వెళ్లకపోవడానికి కారణమే. రాత్రయితే చాలు... లక్ష్మి, ఆమె భర్తతో కూడి సరాగాలాడుతున్న దృశ్యాలను ఊహించుకుని మరీ బెంగపడే వాడు కిషన్.

నాలుగు రోజుల తర్వాత వచ్చింది లక్ష్మి. ముఖంలో దిగులు ఆవరించింది.

''ఏం లక్ష్మీ! బొత్తిగా నల్ల పూసవై పోయావ్.'' పలకరించాడు కిషన్.

''నా నల్ల పూసలకే చేటొచ్చిందయ్యా! అందుకే రాలేక పోయాను...'' కళ్లలో కన్నీరు స్రవిస్తుండగా అంది లక్ష్మి.

''ఏమైంది?'' ఆత్రుతగా అడిగాడు కిషన్.

''నా మొగుడికి సుస్తీ చేసింది. రేపోమాపో అన్నట్లయింది పరిస్థితి. చివరికి నా మాంగల్యం నాకు దక్కింది. అన్ని రోజులూ రాత్రనకా, పగలనకా భర్త పక్కనే ఉండి సేవలు చేయాల్సి వచ్చిందయ్యగారు. ఏం భగవంతుడో కనికరించి నా భర్తను బతికించాడు...'' చెప్పింది లక్ష్మి.

కిషన్‌కి లక్ష్మి గుర్తొచ్చింది. నిలువెత్తు విగ్రహంగా కాదు... ముఖం నుంచీ గుండెల వరకూ. ఏ మాత్రం తెరచాటు లేని ఎత్తయిన కలశాలు. ఆ రెండింటి మధ్య నుంచి జాలువారే పయ్యెద. ఆ దృశ్యం ఎంతో అపురూపంగా అనిపిస్తోంది కిషన్‌కి. లక్ష్మి ఎప్పుడు కళ్లవాకిళ్లలో వాలినా అదే రూపం కనిపిస్తోంది.

''ఇప్పుడెలా ఉంది?''

''ఫర్వాలేదు. అయితే, లేచి నడిచేందుకు కొన్నినెలలు పడుతుందన్నారు. ఏ వాతమో తెలీడం లేదు. కాళ్లూ చేతులూ కదపలేక పోతున్నాడు. ప్రతి రోజూ నూనెతో మర్దనా చేయాల్సిందే. చిన్న పిల్లాడ్ని నడిపించినట్లు నడిపించాల్సిందే...''

వింటున్నాడు కిషన్.

''ఇప్పుడు పనేం చేయనక్కర్లేదు. నీ మనసు, నీ భర్త ఆరోగ్యం కుదుటపడిన తర్వాతనే మళ్లీ పనిలోకి వద్దువు గానీ...'' అన్నాడు కిషన్.

''కొన్ని నెలల పాటు నా మొగుడేం పని చేయలేడు. ఇక, నేను కూడా పనిచేయకుంటే రోజెలా గడుస్తుంది? చేస్తాను బాబుగారు...'' అంటూ ఆమె మూలనున్న చీపురు తీసుకుని గదులను శుభ్రం చేయడం ప్రారంభించింది. లక్ష్మి వంక అదే పనిగా చూస్తున్నాడు కిషన్.

''నిన్నా మొన్నా ఆమె రాని రోజుల్లో ఆమె గురించి ఎంత తప్పుగా అనుకున్నాడు తను. భర్తతో కులుకుతోందని భావించాడు. కానీ, రోగంతో అల్లాడుతున్న భర్త ఆరోగ్యం కోసం అహర్నిశలూ ఆ ఇల్లాలు కంటిమీద కునుకు లేకుండా సేవలు చేసింది. ఇంకా చేస్తోంది. భార్యాభర్తలు రాత్రయితే అదే పనిలో ఉంటారనుకోవడం ఎంత తప్పో తెలిసి వచ్చిందీ నాటికి... వారిద్దరి నడుమ సంబంధం కేవలం శారీరకమే కాదు, మానసికం కూడా. భర్త బాధ పడితే భార్య మనసు చివుక్కుమంటుంది. భార్య కష్టంలో ఉంటే భర్త కంగారు పడతాడు. అదే ప్రేమంటే...! తనకు అసలు కామం తప్ప ప్రేమంటే తెలుసా? ఒకవేళ తెలిస్తే... తన వంశాన్ని పెంచేందుకు తన ఇంటి పేరుతో సహా అన్నింటినీ మార్చుకుని తనింటి గడప తొక్కిన అర్ధాంగి పురిటి కోసం పుట్టింటికి వెడితే... ఇక్కడ చలించిన మనసుతో పెడమార్గంలో పడి కొట్టుకుపోతున్నాడు...'' తల చుకుంటేనే తనమీద తనకే అసహ్యమేస్తోంది కిషన్‌కి. లక్ష్మిలో మార్పేమీ లేదు. అచ్చం అలాగే ఉంది. ఏ మాత్రం తెరచాటులేని ఎత్తయిన కలశాలు. ఆ రెండింటి మధ్య నుంచీ జాలువారే పైట. అలా ఆమె వంగినప్పుడు లూజుగా ఉన్న జాకెట్‌లోంచి కనిపిస్తున్న బంగారు వర్ణాల ఆ రెండు బంతులు.

''అవి నిన్నటిదాకా ఎంతగానో ఆకర్షించేవి. బంధించే బ్రా లేక అడ్డుకునేవారెవరూ లేరనే పొగరుతో విచ్చలవిడిగా ఎగిరెగిరి పడుతున్నాయనుకున్నాడు తనింతవరకు. లక్ష్మి సహజ సిద్ధంగా తానెలా ఉండాలో అలాగే ఉంది.

తనలోని స్త్రీత్వాన్ని మగాళ్లు గుర్తిస్తున్నారా, లేదా అని పరిశీలిస్తూ, అవయవాలను అనుక్షణం దాచుకోవాలని, అడపాదడపా వాటిని ప్రదర్శనకు ఉంచాలనే తపన, తాపత్రయం ఏనాడు లేదామెలో.

ఆమె మంచులో తడిసిన గడ్డి పూవులాంటి స్వచ్ఛతను ఆపాదించుకున్న తరుణి. మరి తానో, ప్రతి అందాన్నీ కాముకత్వంతో చూసే వ్యక్తి'' కిషన్‌కి తెలీకుండానే కళ్ల వెంబడి నీరొచ్చింది. భుజ మీమ్మీద తువ్వాలుతో కళ్లు తుడుచుకుంటూ లోనికి వెళ్లి బీరువా నుంచి కొంత డబ్బు తీసి – ''లక్ష్మీ! ఎందుకైనా పనికొస్తుంది. ఇది ఉంచు...'' అంటూ ఇవ్వబోయాడు.

''ఎందుకయ్యా ఈ డబ్బు...'' తీసుకునేందుకు నిరాకరించింది మొదట. కిషన్ మొహమాట పెట్టి – ''నీ భర్త ఆరోగ్యంతో కోలుకునేంతవరకూ ఖర్చుల కోసం ఇది ఉంచు...'' అంటూ ఆ డబ్బును ఆమె చేతిలో పెట్టాడు కిషన్.

ఆమె చేతి స్పర్శ తగిలినా ఇప్పుడతనిలో ఏ రకమైన మోహం లేదు.

దృష్టిని బట్టే సృష్టి.

అంతే!

*

చిరునామా:
పి.వి.డి.ఎస్. ప్రకాష్,
12-11-297, వారాసిగూడ,
సికింద్రాబాద్
సెల్: 90005 44160.